

నిధుల్లేకుండా హడావుడి

వైజాగ్ మెట్రో డీపీఆర్‌కు కేంద్రం ఆమోదం తెలపకుండానే టెండర్లు పిలిచారు. దీనిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. 8లో



కేజీహెచ్‌కు వితరణ

మహారాణిపేట: ఈసై ఫార్మాస్యూటికల్స్ కంపెనీ రూ.14 లక్షల సీఎస్సార్ నిధులతో కేజీహెచ్ శిశు శస్త్రచికిత్స విభాగానికి పరికరాలను అందజేసింది.

వాతావరణం



అనకాపల్లి: రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి, తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ఈవీఎం గోదాముల వద్ద అప్రమత్తత అవసరం



రాజకీయ పార్టీల నేతలతో కలిసి ఈవీఎం గోదాములను తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ఈవీఎం గోదాముల వద్ద సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. నెలవారీ తనిఖీలో భాగంగా ఎస్పీ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోదాములను శుక్రవారం ఉదయం ఆమె డీఆర్‌వో వై.సత్యనారాయణరావు, వివిధ రాజకీయ పార్టీల నేతలతో కలిసి తనిఖీ చేశారు. గోదాముల వద్ద పరిస్థితులతో పాటు సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. లాగ్ బుక్ నిర్వహణ ఇతర అంశాలపై రాజకీయ పార్టీల నేతలతో కలెక్టర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్.వెంకటరమణ, జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.నాయుడు, రాజకీయ పార్టీల నేతలు జాజుల రమేష్, బి.శ్రీనివాసరావు, ఉగ్గిన అప్పారావు, కె.వి.మారియో, కె.హరినాథబాబు, ఆర్.శంకరరావు, విద్యుత్ శాఖ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సేవా దృక్పథం, క్రమ శిక్షణతో విధుల నిర్వహణ

- కొత్త ఎస్‌ఐలకు ఎస్పీ ఠతుహిన్ సిన్హా సూచన



ఎస్పీ తుహిన్‌సిన్హాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కొత్తగా వచ్చిన ఎస్‌ఐలు

అనకాపల్లి: సేవా దృక్పథం, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్‌ఐలకు ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో బేసిక్ శిక్షణ, గ్రేహౌండ్స్ విభాగంలో కమాండో శిక్షణ, కర్నూలులో వివిధ రకాల ఆయుధాలతో శిక్షణ పొందిన నలుగురు ప్రొబేషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్లను జిల్లాకు కేటాయించారు. ఈ మేరకు వారు ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ తుహిన్ సిన్హాను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను సకాలంలో పట్టుకోవాలన్నారు. అనంతరం కొత్తగా వచ్చిన ఎస్‌ఐలు కె.పోషణ గౌరీ, ఎన్.విజయకుమారి, షేక్ షాహిబా అంజుమ్, జి.కమల భార్గవ్‌తో శిక్షణ కాలంలోని వివిధ అంశాలపై ఎస్పీ ఆరా తీశారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు

అచ్యుతాపురం: కోనంపాలెం పరిధిలో బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ముస్తాఫా అనే వ్యక్తిపై పోక్సో కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాలు.. సెజ్ కేంద్రంగా ఉండే అచ్యుతాపురంలో హోటళ్లకు, రెస్టారెంట్లకు డిమాండ్ ఉంది. ఈ క్రమంలోనే కోనంపాలెం పరిధిలో ఓ బిర్యానీ పాయింట్ ఉంది. అందులో పనిచేస్తున్న బాలికను ముస్తాఫా అనే వ్యక్తి గది శుభ్రపరిచేందుకు పిలిచి అసభ్యంగా ప్రవర్తించాడు. గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనతో షాక్ గురైన బాలిక పోలీసులను ఆశ్రయించగా ప్రాథమిక దర్యాప్తు జరిపి పోక్సో నమోదు చేశారు.

ఐటీఐ విద్యార్థులకు ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్

అనకాపల్లి: ఐటీఐలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రజా రవాణాశాఖ (ఆర్టీసీ)లో అప్రెంటిస్ చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు ఆ శాఖ జిల్లా అధికారి వి.ప్రవీణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈనెల 26 నుంచి ఆగస్టు 9వ తేదీలోగా సమర్పించాలని తెలిపారు. డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్ విభాగాల్లో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. విజయనగరం జోనల్ కార్యాలయంలో వచ్చే నెల 13న ఉదయం 10 గంటల నుంచి అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. వివరాలకు www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని ఆమె కోరారు.

సిరులు కురిపించు.. శ్రావణ లక్ష్మీ!



అనకాపల్లి: సతకంపట్టు కనకదుర్గమ్మవారు



అనకాపల్లి: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

అనకాపల్లి/కె.కోటపాడు: పవిత్ర శ్రావణమాసం తొలి రోజే శుక్రవారం కావడంతో ఘనంగా ప్రారంభమయింది. అమ్మవారి ఆలయాలు శ్రావణ లక్ష్మి నామస్మరణతో మార్మోగాయి. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనకాపల్లిలోని గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో సామూహిక వరలక్ష్మీదేవి వ్రతాలను నిర్వహించారు. విశేష అలంకరణలో సతకంపట్టు కనకదుర్గ అమ్మవారు దర్శనమిచ్చారు. కె.కోటపాడులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆలయ కమిటీ సభ్యులు 300 కిలోల పసుపు కొమ్ములతో ప్రత్యేక అర్చన జరిపారు. ఆలయ అర్చకులు గోరుగుంతు రమేష్‌బాబు, వాసవీ క్లబ్ ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల రాంబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



కె.కోటపాడు: పసుపు కొమ్ములతో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి అర్చన

ఎ.కోడూరు హాస్టల్ వార్డెన్‌పై విచారణ

- అవకతవకలు గుర్తించిన ఏసీబీ
- దర్యాప్తునకు విచారణాధికారి నియామకం

కె.కోటపాడు: ఎ.కోడూరులోని సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన బాలుర ఇంటిగ్రేటెడ్ వసతి గృహంలో అవకతవకలపై దర్యాప్తు చేసేందుకు ప్రభుత్వం విచారణాధికారిని నియమించింది. కృష్ణా జిల్లా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ షేక్ షాహిద్‌బాబును విచారణ అధికారిగా నియమిస్తూ జీవోను విడుదల చేసింది. 2019 ఆగస్టు 31న ఈ హాస్టల్‌ను ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో వసతిగృహం వార్డెన్ ఇ.గోవింద్ అవకతవకలకు పాల్పడినట్టు గుర్తించారు. ఏసీబీ అధికారులు గుర్తించిన అంశాలపై విచారణకు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.ఎం.నాయక్ శుక్రవారం విచారణాధికారిని నియమించారు. విచారణలో విశాఖపట్నం ఏసీబీ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కు మార్ పాల్గొనాలని ప్రిన్సిపల్ సెక్రటరీ జీవోలో పేర్కొన్నారు.

కదంతొక్కిన పెన్షనర్లు





విశాఖలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పెన్షనర్ల మానవహారం (ఇన్‌సెట్) ప్లకార్డుతో పెన్షనర్

బీచ్‌రోడ్డు (విశాఖ): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లు 2025లో భాగంగా సీసీఎస్ పెన్షన్ రూల్స్‌కు చేసిన చట్ట సవరణలకు వ్యతిరేకంగా పెన్షనర్లు ఆందోళన చేపట్టారు. శుక్రవారం ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పెన్షనర్లకు పెన్షన్ పెంచకుండా ఎగ్గొట్టాలని చూస్తోందని ఆరోపించారు. ఇందులో భాగంగానే పెన్షన్ చట్టానికి సవరణలు చేసిందని, ఇది పెన్షనర్లను కొత్త, పాత అని విభజిస్తోందని, ప్రస్తుత పెన్షనర్లకు నష్టం కలిగిస్తుందని అన్నారు. ఏఐబీడీపీఏ జిల్లా కార్యదర్శి, ఫోరం చైర్మన్ కె.రామాంజనేయులు మాట్లాడుతూ ఈ చట్టం చెల్లుబాటుకు వ్యతిరేకంగా 'ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్స్' సుప్రీంకోర్టులో కేసు వేస్తోందని తెలిపారు. న్యాయపరమైన చర్యలతో పాటు, వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేయాలని, అందులో భాగంగానే మొదటి చర్యగా మానవహారం నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్, పోస్టల్, ఆర్ఎంఎస్, సెంట్రల్ పెన్షనర్స్, ఎన్ఎస్‌టీఎల్, ఈఎన్‌సీపీడబ్ల్యూఏ, ఇన్‌కమ్ టాక్స్, సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్, సీపీడబ్ల్యూడీ, జీఐసీ, ఏఐపీఆర్‌పీఏ, కేంద్రీయ విద్యాలయాలతో సహా వివిధ పెన్షనర్ల సంఘాల నుండి సుమారు 200 మంది పెన్షనర్లతోపాటు ఎం. చంద్రశేఖరరావు, ఎస్.ఎం. మౌలాలి, పి. గోపాలకృష్ణ, కె.వి. రామకృష్ణ, సంజీవరెడ్డి, అష్రాఫ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డిసెంబర్ 26 నుంచి విశాఖ ఉత్సవ్

మహారాణిపేట (విశాఖ): పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరగనున్న ట్రావెల్ మార్ట్ (సెప్టెంబర్ 17–19), భీమిలి ఉత్సవ్ (నవంబర్ 30), విశాఖ ఉత్సవ్ (డిసెంబర్ 26–28), ఉగాది ఉత్సవాలను (మార్చి 19, 2026) ప్రజల్లోకి తీసుకెళ్లాలని విశాఖ కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను కోరారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ నుంచి పర్యాటకుల రాక పెరుగుతుందని, కాబట్టి ఇప్పటి నుంచే జిల్లాలోని పర్యాటక, సాంస్కృతిక ప్రాంతాలను హైలైట్ చేయాలని సూచించారు. విశాఖ పర్యాటకాన్ని డిజిటల్ మీడియా ద్వారా దేశ విదేశాలకు ప్రచారం చేయాలని కలెక్టర్ కోరారు. హెరిటేజ్ స్థలాలు, దేవాలయాలు, సాహస ప్రదేశాలు, ఇప్పటివరకు వెలుగులోకి రాని ప్రాంతాలపై రాబోయే 3–4 వారాల్లో ఫోటో, వీడియో పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందిస్తామని కలెక్టర్ ప్రకటించారు.

మా దారి.. అడ్డదారి

- వాకరోడ్డు నిర్మాణంపై వివాదం
- వెంటాడుతున్న ఎన్నో ప్రశ్నలు
- నిర్మిస్తున్న తీరుపై అనుమానాలు



ప్రభుత్వ భూమిలో అక్రమంగా వేసిన రోడ్డు

వాక రోడ్డు ఏ శాఖ పరిధిలోకి వస్తుంది.. ఈ రహదారిని ఎవరు నిర్మిస్తున్నారు.. నిధులు ఎవరు ఇచ్చారు.. ఈ రోడ్డు వల్ల ఎవరికి మేలు.. ఇవన్నీ ప్రస్తుతానికి సమాధానం లేని ప్రశ్నలే..

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం ఎరకన్నపాలెం గ్రామం నుంచి యలమంచిలి మండలం పెద్దపల్లి వరకు కొత్తగా వేస్తున్న వాక రోడ్డు నిర్మాణంపై వివాదం నెలకొంది. అకస్మాత్తుగా ఈ రోడ్డు నిర్మాణం చేపట్టడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ నాయకులతో కలిసి అక్రమంగా వేసిన వాక రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించడంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. రోడ్డు వేసేందుకు తాము ఆటంకం కాదని, నిధులు ఎక్కడివి, ఏ శాఖ ద్వారా రహదారి నిర్మాణం చేపడుతున్నారో అధికారులు స్పష్టత ఇవ్వాలని గణేష్ డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే అడిగిన దానికి సమాధానం చెప్పలేక అధికార పార్టీ నాయకులు.. ప్రజలే స్వచ్ఛందంగా రోడ్డు వేసుకుంటున్నారని వల్లె వేస్తున్నారు. ప్రభుత్వ భూమిలో వందలాది వృక్షాలను తెగనరికి అక్రమంగా రోడ్డు వేయడాన్ని మాజీ ఎమ్మెల్యే గణేష్ వెలుగులోకి తెచ్చారు. దీంతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. జాయింట్ సర్వే చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.

అర్థం కాని ప్రశ్నలెన్నో..

ఇంత అర్జెంటుగా ఈ ప్రాంత ప్రజలకు రోడ్డు అవసరం ఎందుకు వచ్చింది అనేది అర్థం కావటం లేదు. దీని వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉందనేది బహిరంగ రహస్యం. ప్రభుత్వ భూమిలో రోడ్డు నిర్మించాలంటే అనుమతులు తప్పనిసరి. అనుమతులు లేకుండా రోడ్డు వేస్తే అది ఆక్రమణ కిందకు వస్తుంది. ప్రభుత్వ భూమిని అక్రమించి రోడ్డు వేస్తుంటే అధికార యంత్రాంగం ఏం చేస్తోందన్నది ప్రశ్న. పైగా అటవీ, రెవెన్యూ శాఖలు ఈ భూమి మాదంటే మాదని వాదులాడుకుంటున్నాయి. గతంలో రాచపల్లి, జి.వెంకటాపురం, ఎరకన్నపాలెం గ్రామాల ప్రజలతో ప్రస్తుతం రోడ్డు వేస్తున్న భూమిలో అటవీ శాఖ అధికారులు వన సంరక్షణ సమితులు ఏర్పాటు చేసిన విషయాన్ని స్థానికులు గుర్తు చేస్తున్నారు. అటవీశాఖకు సంబంధించిన భూమి కావడంతో పొక్లెయిన్లతో రోడ్డు పని చేస్తుంటే అటవీశాఖ ఉద్యోగులు అడ్డుకొని మాకవరపాలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. ఈ భూమి రెవెన్యూ శాఖదేనని అధికార పార్టీ నాయకులు అంటున్నారు. ఈ భూమి ఎవరికి చెందుతున్న విషయమై ప్రస్తుతం జాయింట్ సర్వే నిర్వహిస్తున్నారు. జాయింట్ సర్వే జరుగుతుండగానే అధికార పార్టీ నేతలు తప్పుడు ప్రచారానికి తెర తీస్తున్నారు. సర్వే పూర్తయిందని ఈ భూమి రెవెన్యూదేనని జరుగుతున్న ప్రచారంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ భూమి అయితే ఆక్రమించుకొని అడ్డగోలుగా రోడ్డు వేయవచ్చా..? ఆక్రమణకు గురైతే ఆ శాఖ అధికారులకు బాధ్యత లేదా అనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. వన్యప్రాణులకు అనువైన వాక ప్రాంతంలో ఆరు అడుగులున్న కాలిబాటను 30 అడుగుల మేర విస్తరించటం వల్ల వాటి మనుగడకు ప్రమాదం ఏర్పడే అవకాశముంది. యంత్రాలతో రోడ్డు నిర్మించడానికి ఎవరు పెట్టుబడి పెడుతున్నారు, ఏ ప్రయోజనాలు ఆశించి ఈ రోడ్డు నిర్మిస్తున్నారు, ఇది ప్రజలకు అవసరమా.. లేక అధికార పార్టీ నేతల అడ్డగోలు వ్యవహారాలకు అవసరమా అనేది తేలాల్సి ఉంది.

కలెక్టర్ ఆదేశాలతో జాయింట్ సర్వే



కలెక్టర్ ఆదేశాలతో జాయింట్ సర్వే చేస్తున్నాం. రాచపల్లి రెవెన్యూ సర్వే నెంబరు 737లో 1600 ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం రోడ్డు వేస్తున్న స్థలాన్ని పశువులు, మనుషులు వెళ్లేందుకు 1967లో ఫారెస్ట్ వారు బాటగా నోటిఫై చేసి ఉన్నారు. ఇందులో కొంత అటవీ శాఖకు చెందినదని వారు చెబుతున్నారు. అది ఏవిధంగా దఖలు పడింది.. వారి భూమి ఎంత అనే దానిపై రెవెన్యూ, అటవీ శాఖలతో జాయింట్ సర్వే చేస్తున్నాం.

–వెంకటరమణ, తహసీల్దార్, మాకవరపాలెం

అడుగడుగునా వైఫల్యాలు.. నిలువెల్లా మోసాలు

- కలసికట్టుగా కూటమి తీరును ఎండగడదాం
- నమ్మించి వంచించడం చంద్రబాబు నైజం
- వైఎస్సార్‌సీపీ యలమంచిలి సమన్వయకర్త ధర్మశ్రీ
- 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'పై విస్తృతస్థాయి సమావేశం





సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ. వేదికపై పార్టీ నేతలు కన్నబాబురాజు, బొడ్డేడ ప్రసాద్.. సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

యలమంచిలి రూరల్:

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్దామని, వారి మోసాలను ఎండగడదామని వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. శుక్రవారం యలమంచిలి గురప్ప కల్యాణ మండపంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'పై మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో చేపట్టే ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రతి గడపకూ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు అర్థమయ్యేలా తెలియజేద్దామన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను నిలువునా ముంచారని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో తల్లికి వందనం అనేకమందికి అందలేదన్నారు. అన్నదాతా సుఖీభవ ఇవ్వకుండా రైతులను సంక్షోభంలోకి నెట్టారన్నారు. ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తామని చెప్పి ఇప్పుడు సూపర్ సిక్స్ హామీల అమలుకు రాష్ట్రాన్ని అమ్మేయాలంటూ నిస్సిగ్గుగా మాట్లాడడం వారికే చెల్లిందన్నారు.

అన్ని వర్గాలకు అన్యాయం

మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు, వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులు, మహిళలు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాలను కూటమి ప్రభుత్వం నిలువునా మోసగించిందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు బకాయిలు పెట్టారన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించడం మర్చిపోయారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల ముందిచ్చిన హామీలను నూరుశాతం అమలు చేశారని, సంక్షేమానికి కొత్త అర్థం చెప్పిన నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త చరిత్రను రాశారన్నారు. యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2.0 పాలనలో కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం ఉంటుందని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీకి సంబంధించిన క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను నియోజకవర్గ సమన్వయకర్త ధర్మశ్రీ ఆవిష్కరించారు. యలమంచిలి పట్టణ పార్టీ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొర, పార్టీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, మున్సిపల్ వైస్‌చైర్మన్లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఉద్దండం త్రినాథరావు, సేనాపతి రాము, దూది నర్సింహమూర్తి, కొఠారు కొండబాబు, రాపేటి సంతోష్, పిట్టా సత్తిబాబు, పిల్లా త్రినాథరావు, నెట్టెం సత్యనారాయణ, పిట్టా సత్తిబాబు, పలివెల అమృతవల్లి సుమారు 400 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కన్నబాబు రాజు, బొడ్డేడ

ధర్మశ్రీ ఛలోక్తులకు చప్పట్లే చప్పట్లు

తొలిసారిగా యలమంచిలి పార్టీ సమావేశంలో ప్రసంగించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ తనదైన స్టైల్‌లో ఛలోక్తులతో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. 18 సంవత్సరాలు నిండిన ఆడబిడ్డకు రూ.1500 ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలంట.. మీరు చెబితే మేము నమ్మేయాలా.. అనడంతో చప్పట్లు మార్మోగాయి. ఎన్నికల్లో మిమ్మల్ని కుమ్మేయాలి.. కూటమి నేతలపై ఎక్కడ ఉమ్మాలో అక్కడ ఉమ్మేయాలన్నారు. నిరుద్యోగ భృతి.. నిరుద్యోగ మృతిగా మారిందన్నారు. తల్లికి వందనం పూర్తిగా ఇవ్వలేదు గానీ నాన్నకు కావాల్సినంత ఇంధనం (మద్యం) మాత్రం ఎక్కడికక్కడ బెల్టు షాపులు పెట్టి అందిస్తోందన్నారు. ఉచిత బస్సు తుస్సు.. ఉచిత గ్యాస్ అంతా ట్రాష్.. అన్నారు. కూటమి ప్రభుత్వంలో మూడు పార్టీలు.. ఆరు గ్రూపులుగా దోచుకుంటున్నారన్నారు. ఛలోక్తులతో కూడిన ధర్మశ్రీ మాటలకు కార్యకర్తలు చప్పట్లు, ఈలలతో హర్షధ్వానాలు చేశారు.

క్లుప్తంగా

చెట్లు మాయం చేసిన వారిపై కేసు పెట్టాలి

- పోలీసు స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుల ఫిర్యాదు



పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నర్సీపట్నం : ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను నరికేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ మాకవరపాలెం ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ, వివిధ విభాగాల పార్టీ నాయకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీమబోయినపాలెం, శెట్టిపాలెం పంచాయతీ పరిధి నర్సీపట్నం నుండి అనకాపల్లి పోవు అర్‌అండ్‌బి రోడ్డుకి ఇరువైపులా ఉన్న వందేళ్ల వయస్సు కలిగిన భారీ వృక్షాలను అధికార పార్టీ నాయకులు, అధికారులు కుమ్మక్కై చెట్లు నరికేసి రాత్రికి రాత్రే తరలించుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకులకు భయపడి పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ఫిర్యాదు చేయలేదన్నారు. చెట్లు మాయమవడానికి కారణమైన అధికారపార్టీ నాయకులు, అర్‌అండ్‌బీ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. రూ.40 లక్షల విలువైన చెట్లను అక్రమంగా తరలించుకుపోయారని తక్షణమే కేసులు పెట్టాలని కోరారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా లక్ష్యం

- డీఆర్వో సత్యనారాయణరావు

తుమ్మపాల: తప్పులు లేని ఓటర్ల జాబితాను తయారు చేయడంలో జిల్లా యంత్రాంగానికి సహకరించాలని డీఆర్వో వై.సత్యనారాయణరావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రాజకీయ నాయకులతో నెలవారీ ఓటరు జాబితా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్ల చేరికను దృష్టిలో ఉంచుకుని 1,150 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో కొత్త భవనాలను గుర్తించాలన్నారు. 1,150 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉంటే, అదనపు ఓటర్లను తక్కువ మంది ఉన్న సమీప పోలింగ్ కేంద్రాల్లో చేర్చాలన్నారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ అందిన తర్వాత, ఈఆర్వోలు తయారు చేసిన ప్రస్తుత తాత్కాలిక ప్రతిపాదనలతో హేతుబద్ధీకరణ నిర్వహించాలన్నారు. వివిధ రాజకీయ పార్టీ నేతలు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. ఓటరు జాబితా తయారీలో అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంటు ఎస్.ఎస్.వి.నాయుడు, వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ, సీపీఎం, తదితర పార్టీల ప్రతినిధులు జాజుల రమేష్, బి. శ్రీనివాసరావు, జె.రమేష్, కె.హరినాథబాబు, ఆర్.శంకరరావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

వైజాగ్ మెట్రోకి టెండర్లు

- ఫేజ్–1లో 46.23 కిమీకు టెండర్లు పిలిచిన ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్
- డీపీఆర్‌కు కేంద్రం ఆమోదం తెలపకుండానే టెండర్లు పిలవడంపై విమర్శలు
- కేంద్రం నిధులు ఇస్తుందా లేదా అనేదానిపైనా నీలినీడలు
- గొప్పల కోసమే కూటమి ప్రభుత్వం టెండర్ల హడావిడి
- వీఎంఆర్డీఏ నిధులు మెట్రోకి మళ్లించే ప్రయత్నం
- ఇప్పటికే ఆదాయం లేక కునారిల్లుతున్న వీఎంఆర్డీఏ
- తాజా నిర్ణయంతో మరింత ఆర్థిక భారం

డీపీఆర్ ఆమోదం లేకుండా టెండరు..
నిధుల్లేకుండా హడావుడి

సాక్షి, విశాఖపట్నం: డీపీఆర్‌కు ఆమోదం చెప్పలేదు.. కేంద్రం నుంచి ఒక్క రూపాయి విదిల్చలేదు.. భూ సేకరణకు కూడా అడుగు పడలేదు.. కనీసం మా వంతు సహకారం అందిస్తామన్న హామీ కూడా రాలేదు. కానీ.. కూటమి ప్రభుత్వం ప్రచారం కోసం హడావిడి ప్రారంభించేసింది. రూపాయి లేదు.. డీపీఆర్ లేదు.. కొడుకు పేరు వైజాగ్ మెట్రో అన్నట్లుగా.. ప్రజల్ని మభ్య పెట్టేందుకు వైజాగ్ మెట్రో నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించింది. ఫేజ్–1లో 46.23 కిమీ నిర్మించేందుకు టెండర్లు పిలిచిన ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్(ఏఎంఆర్‌సీ) దాదాపు రూ.6500 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఒక ఫ్లైఓవర్ నిర్మాణానికే రెండేళ్లకు పైగా సమయం పడుతుంది. కానీ.. 42 ఎలివేటెడ్ మెట్రో స్టేషన్లతో కూడిన 46.23 కిమీ మెట్రో ప్రాజెక్టు అగ్రిమెంట్ అయిన 30 నెలల్లో పూర్తి చేసెయ్యాలంటూ నిబంధనలు విధించింది. ఈ ప్రాజెక్టు కోసం వీఎంఆర్‌డీఏని ఆర్థికంగా బలి చేసేందుకు చంద్రబాబు సర్కారు నిర్ణయించింది.

విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టుకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. మొదటి దశలో 46.23 కిలోమీటర్ల మేర మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ.6250 కోట్లు(జీఎస్‌టీ అదనం)తో టెండర్లుకు శుక్రవారం ఆహ్వానించింది. ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.11,498 కోట్లు కాగా..మూడు కారిడార్లలో ఫేజ్ –1 పనుల కోసం ఈపీసీ ప్రాతిపదికన ఏఎంఆర్‌సీ టెండర్ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ పనుల్ని మూడేళ్ల కాలపరిమితితో పూర్తి చేయాలని టెండర్ షెడ్యూలులో పేర్కొన్నారు. టెండర్ సమర్పించిన 180 రోజుల వరకూ బిడ్ వ్యాలిడిటీ ఉంటుందని నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టును మొత్తం 140.13 కి.మీలో చేపట్టనున్నారు. తొలి దశలో 46.23 కిలోమీటర్ల మేర చేపట్టనుండగా.. ఇందులో మొత్తం 42 ఎలివేటెడ్ మెట్రో స్టేషన్లు రానున్నాయి. ఇందులో 20.16 కి.మీ డబుల్ డెక్కర్ తరహాలో ఫ్లైఓవర్లు నిర్మిస్తారు. మధురవాడ నుంచి తాటిచెట్లపాలెం, గాజువాక నుంచి స్టీల్‌ప్లాంట్ వరకూ పై వంతెనలు నిర్మిస్తారు. కొమ్మాది- స్టీల్‌ప్లాంట్, గురుద్వారా-పాతపోస్టాఫీసు, తాటిచెట్లపాలెం-చినవాల్తేరు కారిడార్లలో తొలి దశ కింద మెట్రోకు ప్రణాళిక చేశారు. కొమ్మాది–స్టీల్‌ప్లాంట్ మధ్య ఏర్పాటు చేసే 34.40 కిలోమీటర్ల కారిడార్లో డబుల్ డెక్కర్ ట్రాక్ నిర్మించనున్నారు. అలాగే మధురవాడ నుంచి తాటిచెట్లపాలెం వరకు 15.06 కిమీ మేర రెండో కారిడార్‌ను నిర్మిస్తారు. గాజువాక నుంచి స్టీల్‌ప్లాంటు మధ్య మరొక కారిడార్ ఏర్పాటు చేయనున్నారు.

30 నెలల్లో పూర్తి చెయ్యాలంట..

ఈ నెల 28న ఏపీ ఈప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్లు పెట్టనున్నారు. సెప్టెంబర్ 12న టెండర్లు ఓపెన్ చెయ్యనున్నారు. అనంతరం వడపోత తర్వాత.. టెండర్ దక్కించుకున్న సంస్థతో అగ్రిమెంట్ కుదుర్చుకుంటారు. ఆ తర్వాత 30 నెలల్లో మొత్తం ప్రాజెక్టు పూర్తి చెయ్యాలని షరతు విధించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక కిలోమీటర్ ఫ్లైఓవర్ పూర్తి చేసేందుకు రెండేళ్లకు పైగా సమయం పడుతుంది. కానీ.. కూటమి ప్రభుత్వం మాత్రం 46 కిమీ మెట్రో ప్రాజెక్టు రెండున్నరేళ్లలోనే పూర్తి చేసెయ్యాలని చెప్పడం చూస్తే.. ఇదంతా ప్రజల్ని మభ్యపెట్టి.. ప్రచారం కోసమే నన్నట్లుగా అర్థమవుతోంది. అదేవిధంగా.. డబుల్ డెక్కర్ నాలుగు లైన్ల ఫ్లై ఓవర్‌ని కూడా 24 నెలల్లో పూర్తి చేసేస్తారని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది.



ఒక్క అడుగు కూడా పడకుండానే..!

ఒక ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ని కేంద్రం ఆమోదించాలి.. నిధులు చూపించిన తర్వాతే.. టెండర్లకు వెళ్తుంటారు. కానీ.. వైజాగ్ మెట్రో విషయంలో మాత్రం తిమ్మిని బమ్మి చేసేస్తున్నారు. రాష్ట్ర కేబినెట్ డీపీఆర్‌ని ఆమోదించి.. కేంద్రానికి పంపించింది. నెల రోజుల క్రితం కూటమి ఎంపీలు కేంద్ర మంత్రిని కలిసి.. డీపీఆర్ అమోదించాలని కోరారు. కానీ.. ఇంతవరకూ డీపీఆర్‌ని ఆమోదించలేదు. అంతే కాదు.. విభజన చట్టంలో భాగంగా.. మెట్రోకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలి. కానీ.. ఇంతవరకూ మెట్రో కోసం నిధులు మంజూరు చేస్తామని కేంద్రం ప్రకటించలేదు. రెండు ఫేజ్‌లలో మెట్రో ప్రాజెక్టు పూర్తి చేసేందుకు 99.75 ఎకరాల భూసేకరణ చేపట్టాలి. ఇది కూడా సర్వే జరిగింది. ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతోంది. భూసేకరణ ప్రక్రియ మాత్రం జరగలేదు. ఇన్ని అడ్డంకులు ఉన్నా.. టెండర్లు పిలిచి.. రెండున్నరేళ్లలో పూర్తి చేసేస్తామంటూ కూటమి ప్రభుత్వం నిస్సిగ్గుగా ప్రకటించడం హాస్యాస్పదం.

వీఎంఆర్‌డీఏపై 'ఆర్థిక' భారం.!

సంపద సృష్టించే పార్టీ తెలుగుదేశం పార్టీ అంటూ బాకాలు ఊదిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో అప్పుల మూటని రాష్ట్రం నెత్తిన పెట్టేశారు. ఇప్పుడు.. తన ప్రచారయావ కోసం మరోసారి వీఎంఆర్‌డీఏని బలి చేసేందుకు కుట్రపన్నుతున్నారు. ఉమ్మడి ఏపీకి సీఎంగా ఉన్న సమయంలో వీఎంఆర్‌డీఏ(అప్పటి వుడా) ఆస్తుల్ని విక్రయించి.. హైదరాబాద్ అభివృద్ధి కోసం ఖర్చు పెట్టి.. విశాఖకు రిక్త హస్తాలు చూపించారు. ఇప్పుడు.. మరోసారి వీఎంఆర్‌డీఏపై 'ఆర్థిక' భారం మోపేందుకు కూటమి సర్కారు సిద్ధమైంది. అంతంత మాత్రం ఆదాయంతో కొట్టుమిట్టాడుతున్న వీఎంఆర్‌డీఏ నుంచి రూ.4,101 కోట్లు తీసుకోవాలని నిర్ణయించింది. వాస్తవానికి వీఎంఆర్‌డీఏ వార్షిక బడ్జెట్ కేవలం రూ.1000 కోట్లు మాత్రమే. ఆదాయం లేక.. తమ ప్రాజెక్టులు పూర్తి చేయడానికే నానా యాతన పడుతున్న సమయంలో.. మొత్తం ఆస్తులు అమ్మేసి.. మెట్రోకి పెట్టాలని కూటమి సర్కారు హుకుం జారీ చేసేసింది. దీంతో.. భారీ మొత్తాన్ని ఎలా భరించాలో తెలీక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రాజెక్టులో ఎలాంటి పురోగతి లేకపోయినా.. టెండర్ల పేరుతో అరచేతిలో మెట్రో చూపించేందుకు కూటమి సర్కారు సిద్ధమవడం సిగ్గు చేటని పలువురు విమర్శిస్తున్నారు.

'అన్యాయంగా భూమి రిజిస్ట్రేషన్ రద్దు చేశారు'

డాబాగార్డెన్స్ (విశాఖ): అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం గంటి కొర్లం ప్రాంతంలో తనకు చెందిన ఎకరా 54 సెంట్ల భూమిని తనకు తెలియకుండా విజయనగరం జిల్లా పాలకొండ సబ్ రిజిస్ట్రార్ అన్యాయంగా రిజిస్ట్రేషన్ రద్దు చేశారని బాధితుడు గంప సత్యనారాయణమూర్తి ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తన అనుమతి లేకుండా విజయనగరం జిల్లా పాలకొండ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి బొల్లా ప్రగడ వెంకటరమణమూర్తి అనే వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని తెలిపారు. సుమారు పదేళ్ల కిందట తన బావమరిది బొల్లాప్రగడ వెంకటరమణమూర్తి తన పేరిట భూమి రిజిస్ట్రేషన్ చేశాడని తెలిపారు.

అయితే ఇటీవల చెప్పుడు మాటలు విని తనను అకారణంగా ద్వేషిస్తూ తనపై ఫిర్యాదులు చేస్తున్నారని, ఇదే విషయంలో జనసేన నాయకునిగా చెప్పుకు తిరుగుతున్న అడ్డుపల్లి గణేష్ గత మే 29న తన భూమిలో 50 మందితో కలిసి వచ్చి తనను చంపేస్తామని, భూమి తనకు వదిలేసి వెళ్లిపోవాలని హెచ్చరించి భయభ్రాంతులకు గురి చేశారన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బాధితుడు సత్యనారాయణమూర్తి

స్థానిక పోలీస్ స్టేషన్‌లో పలుమార్లు తనపై తప్పుడు ఫిర్యాదులు చేసి తనను, తన కుటుంబ సభ్యులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ప్రతిరోజూ సుమారు 20 మంది రౌడీలతో తన ఇంటికి వచ్చి బెదిరిస్తున్నాడని ఆరోపించారు. ఇదే విషయమై ఉప ముఖ్యమంత్రి, అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అయినప్పటికి తనకు ఎటువంటి న్యాయం జరగలేదని, జనసేన నేతగా చెప్పుకుంటున్న అడ్డుపల్లి గణేష్ నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ కల్పించాలని కోరారు.

పాలకొండ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకుని, అన్యాయంగా రద్దు చేసిన తన భూమిని తనకు తిరిగి రిజిస్ట్రేషన్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో గంప గోవిందరాజు, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

కోనాం జలాశయం నీరు విడుదల

చీడికాడ: ఖరీఫ్ సాగుకు మండలంలో కోనాం జలాశయం నీటిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శుక్రవారం విడుదల చేశారు. తొలుత పూజలు చేసి ఇక్కడ ఎగువ కాలువల ద్వారా 30 క్యూసెక్కులు, దిగువ కాలువల ద్వారా 50 క్యూసెక్కులు నీటిని విడిచిపెట్టారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుతం 95.35 మీటర్ల వద్ద ఉంది. కార్యక్రమంలో ప్రాజెక్టు చైర్మన్ పోతల చిన్నంనాయుడు, జలాశయం ఇన్‌చార్జి జేఈ సత్యనారాయణదొర పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన

జలాశయ నీటి విడుదల చేసే కార్యక్రమానికి ప్రొటోకాల్ ప్రకారం తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారద జానకీరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. జలాశయ అధికారుల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.



పూజలు చేసి నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బండారు

దీనిపై ఏఈ సత్యనారాయణదొరను వివరణ కోరగా, ఇన్‌చార్జి జేఈగా వ్యవహరిస్తున్న తాను సమాచారం ఇవ్వడంలో మర్చిపోయానని వివరణ ఇచ్చారు.

ఒత్తిడి లేని జీవనానికి ధ్యానం

పాయకరావుపేట: ఒత్తిడి లేని జీవనానికి ధ్యానం అవసరమని యోగద సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు స్వామిశ్రీ స్మరణానంద గిరి తెలియజేశారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు ఆయన ఉద్బోధించారు. విద్యార్థులు తమ లక్ష్య సాధనకు ఏకాగ్రత పెంపొందించుకోవడానికి ధ్యానం ఒక మార్గమని సూచించారు. ధ్యాన సాధనను ఎలా లోతుగా చేసుకోవాలో వివరించారు. భగవద్గీతలో కృష్ణుడు చెప్పినట్లుగా యోగా, ధ్యానం ద్వారా మనసులో ఉండే భయాలు తొలగిపోతాయన్నారు. అజ్ఞానం అనే అంధకారం తొలగించుకోవడానికి ధ్యానం ఒక మార్గమన్నారు. నిద్ర ద్వారా వచ్చే విశ్రాంతి, శక్తి కన్నా ధ్యానం ద్వారా ఎక్కువ విశ్రాంతి పొందుతామన్నారు. విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి అనునిత్యం పుస్తక పఠనం తప్పనిసరి అని సూచించారు. కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్‌ప్రకాష్, యోగద సత్సంగ ధ్యాన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



స్మరణానంద గిరికి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

కేజీబీవీల్లో ప్రవేశాలకు టీడీపీ నేతల మోకాలడ్డు

- ముడుపులిస్తేనే సీట్లు అంటూ వసూళ్లు
- పేద విద్యార్థులకు అన్యాయం
- అర్హులకు న్యాయం కోరుతూ కలెక్టర్‌కు జెడ్పీటీసీ ఫిర్యాదు

రోలుగుంట: జిల్లాలో గల కేజీబీవీల్లో ఖాళీలు ఉన్న తరగతుల్లో ప్రవేశాల కోసం అర్హులు ఆశతో దరఖాస్తులు చేసుకుంటున్నారు. అయితే ఎప్పటికప్పుడు ఖాళీల గురించి తెలుసుకుంటున్న అధికార పార్టీ నాయకులు ముందుగానే బేరం కుదుర్చుకుని, ఏపీసీకి ముడుపు ఇస్తేనే సీటు వస్తుందని వసూళ్లకు పాల్పడుతున్నారు. స్థానిక కస్తూర్బాలో ఆరో తరగతి -2, ఏడో తరగతి -1 కలిపి మూడు ఖాళీలు ఏర్పడ్డాయి. టీడీపీ నాయకులు నిబంధనలకు వ్యతిరేకంగా తాము సిఫారసు చేసిన వారి కోసం అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. దీంతో దరఖాస్తు చేసుకొని ఆశలు పెట్టుకున్న ఒక విద్యార్థిని వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ దృష్టికి తీసుకెళ్లి తనకు న్యాయం చేయాలని కోరింది. దీనికి స్పందించిన జెడ్పీటీసీ దీనిపై వివరాలు తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి దేవానందరెడ్డికి, ఏపీసీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తనను కలిసిన అర్హత ఉన్న విద్యార్థికి న్యాయం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఇటీవల బుచ్చెయ్యపేట మండలంలో కూడా కేజీబీవీ ఎస్వోపై అధికార పార్టీ నాయకుల ఒత్తిడి వల్ల ఆస్పత్రిలో చేరిన విషయమై పత్రికల్లో వచ్చిన వార్తల గురించి ప్రస్తావించారు. నిబంధనల ప్రకారం తరగతుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో మొదటి ప్రాధాన్యం అనాథలైన పిల్లలు కాగా, రెండవ ప్రాధాన్యం తల్లి కాని, తండ్రి కాని ఒక్కరే ఉన్న వారికి, మధ్యలో చదువు మానేసిన వారికి తదుపరి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే దీనికి భిన్నంగా అధికార పార్టీవారి ఒత్తిడితో అర్హులకు నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. పైన తెలిపిన వారికి ప్రవేశాల్లో అవకాశం కల్పించని పక్షంలో ఎస్సీ, ఎస్టీలకు అవకాశం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు.

యువతి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

బుచ్చెయ్యపేట మండలంలో గల వడ్డాది గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని చెల్లిబోయిన వెంకటలక్ష్మి(18) అదృశ్యమైంది. వారం రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిన ఈమె తిరిగి ఇంటికి చేరలేదు. చుట్టాలు, బంధువుల ఇంటి వద్ద వాకబు చేసిన వెంకటలక్ష్మి ఆచూకీ కనిపించక పోవడంపై ఆమె తండ్రి నాయుడు శుక్రవారం బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యువతి అదృశ్యంపై విచారణ చేస్తున్నట్టు ఎస్‌ఐ ఈశ్వరరావు, అదనపు ఎస్‌ఐ భాస్కరరావు తెలిపారు.



వెంకటలక్ష్మి

వృద్ధుడి అదృశ్యంపై కేసు

రావికమతం: మండల కేంద్రానికి చెందిన అడ్డిపల్లి అప్పారావు(70) అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఎం.రఘువర్మ శుక్రవారం తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి తన తండ్రి కనిపించకుండా పోయాడని, ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో తెల్ల లాల్చీ, ఆఫ్ నిక్కర్ ధరించాడని కుమారుడు అప్పలనాయుడు ఫిర్యాదు చేశాడన్నారు. వృద్ధుడు ఆచూకీ తెలిస్తే 9440904214 ఫోన్ చేసి సమాచారాన్ని తెలియజేయాలని కోరారు.



అప్పారావు

మహిళపైకి దూసుకెళ్లిన కారు

- ప్రమాద స్థలంలోనే దుర్మరణం
- అనాథగా మారిన కుమారుడు

యలమంచిలి రూరల్: పొట్టకూటి కోసం రోజువారీ పనికి నడిచి వెళ్తున్న మహిళను కారు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. యలమంచిలి పట్టణానికి సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆమె ఆరేళ్ల కుమారుడు అనాథగా మిగిలాడు. దీనికి సంబంధించి పెదపల్లి గ్రామ పెద్దలు, పట్టణ ఎస్సై కె. సావిత్రి అందజేసిన వివరాలివి.. పెదపల్లికి చెందిన దాసరి లక్ష్మి(40) భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి తన ఆరేళ్ల కుమారుడితో కలిసి యలమంచిలి మున్సిపాలిటీ పెదపల్లిలో పుట్టింట్లో నివసిస్తోంది. మర్రిబంద సమీపంలో ఫ్యూజన్ బ్రిక్స్ పరిశ్రమలో రోజువారీ కూలీగా పనిచేస్తూ కుమారుడ్ని పోషించుకుంటోంది. శుక్రవారం రోజూలాగే పనికి నడిచి వెళ్తుండగా, ఎర్రవరం డీఎస్‌ఆర్ పెట్రోల్ బంక్ సమీపంలో ఆమెపైకి ఇన్నోవా కారు దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తల్లి మృతదేహం వద్ద కుమారుడు అమ్మా లే అంటూ... పిలుస్తూ బాధపడడం మార్చురీ వద్ద ఉన్న వారందర్నీ కలచివేసింది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను ఎడువుగంటి జగదీష్‌గా పోలీసులు గుర్తించారు. యలమంచిలి మార్చురీలో శవపంచనామా, పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేస్తున్నట్టు పట్టణ ఎస్సై తెలిపారు.



కారు ఢీకొని దుర్మరణం చెందిన లక్ష్మి, లక్ష్మి (ఫైల్)

ఒడిశా మహిళా కూలీ దుర్మరణం

కశింకోట: రోడ్డు ప్రమాదంలో ఒడిశా మహిళా కూలీ (54) దుర్మరణం చెందింది. కశింకోట వద్ద శుక్రవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సీఐ అల్లు స్వామినాయుడు వివరాల ప్రకారం.. ఒడిశాలోని జైపూర్‌కు చెందిన కళావతి కొంతకాలంగా స్థానిక ఇటుకల బట్టీల్లో పని చేస్తోంది. ఈ క్రమంలో కశింకోట కూడలి వద్ద జాతీయ రహదారి దాటుతున్న ఆమెను బొలేరో వ్యాన్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఇటుకల బట్టీ యజమాని ఐదగల మస్తాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఒడిశా కూలీ కళావతి మృతదేహం

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని ధర్నా



కోర్టు వద్ద ధర్నా చేస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట శుక్రవారం న్యాయవాదులు ధర్నా చేపట్టారు. రాష్ట్ర కమిటీ ఆదేశాలు మేరకు విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు. స్థానిక కోర్టులో సమస్యలను పరిష్కరించాలని, మహిళలకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయాలని, అనకాపల్లి కోర్టుకు పర్మినెంట్ భవనాన్ని నిర్మించాలని తదితర డిమాండ్లతో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో అనకాపల్లి బార్ అధ్యక్షుడు పిల్లా హరశ్రీనివాసరావు, కార్యదర్శి బంధం రమణ, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆనకట్ట గేట్లకు మరమ్మతులు చేపట్టాలి



ఆనకట్ట గేట్ల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నీటి సంఘం అధ్యక్షుడు అప్పలనాయుడు

కశింకోట: మండలంలోని ఏఎస్‌పేట గ్రామం వద్ద శారదానదిపై నరసాపురం ఆనకట్ట గేట్లు, మోటార్లకు మరమ్మతులు చేపట్టాలని ఆనకట్ట నీటి సంఘం అధ్యక్షుడు ఉప్పులూరి అప్పలనాయుడు ఆ శాఖ అధికారులను కోరారు. శుక్రవారం ఆనకట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనకట్ట గేట్లు సరిగ్గా పని చేయడం లేదని, దీనివల్ల నదిలో నీటిమట్టం పెరిగితే ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందన్నారు. దీని దృష్ట్యా గేట్లకు మరమ్మతులు చేపట్టాలని, వీటిని పైకి ఎత్తడానికి ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లను సత్వరమే వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అందుకు సాగుకూలంగా స్పందించారన్నారు.

సురక్షిత తాగునీరు అందించేందుకు కృషి



పనులు పరిశీలిస్తున్న జాజుల రమేష్, 84వ వార్డు ఇన్‌చార్జి రాఘవ

అనకాపల్లి: వర్షాకాలంలో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే విధంగా జీవీఎంసీ నీటిపారుదల అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజ విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ కోరారు. 83వ వార్డు కోట్ని వీధిలో మినీ మంచినీటి ట్యాంకు పైప్‌లైన్ల మరమ్మతులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డు పరిధిలో వాటర్ ట్యాంక్ పైపులు పూర్తిస్థాయిలో పాడైపోయినట్లు స్థానికుల ఫిర్యాదు మేరకు జోనల్ నీటి పారుదల శాఖ సిబ్బందితో మాట్లాడి మరమ్మతులు చేయించామన్నారు. వార్డు పరిధిలో జీవీఎంసీ అంబేడ్కర్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులకు తాగునీటి ఇబ్బంది లేకుండా విద్యుత్ బోర్డు మరమ్మతులు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి ఆదేశాలు మేరకు చేయించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, స్థానికులు పాల్గొన్నారు.

అవినీతి తక్కువున్న దేశాలు త్వరగా అభివృద్ధి



మాట్లాడుతున్న రాష్ట్ర సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ శివశంకర్

అనకాపల్లి: అవినీతి తక్కువగా ఉన్న దేశాలు త్వరగా అభివృద్ధి చెందుతాయని రాష్ట్ర సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ తెలిపారు. స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణ మండపంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 'సమాజ అభివృద్ధి–అవినీతి నియంత్రణ' అంశంపై గురువారం రాత్రి సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ అవినీతి నియంత్రణతో సామాజిక సమానత్వం సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ సంస్థల్లో పౌర సేవల డిజిటలైజేషన్ అవినీతిని తగ్గిస్తుందన్నారు. అవినీతిని నియంత్రించకపోతే దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. అవినీతి రహిత వ్యవస్థతో న్యాయం త్వరగా అందుతుందన్నారు. ప్రతి పౌరుడు అవినీతి నిరోధకంగా వ్యవహరించాలన్నారు. దేశాన్ని పట్టిపీడిస్తోన్న అవినీతిని అంతమొందించేందుకు యువత కృషి చేయాలని కోరారు. రోటరీ క్లబ్ పట్టణ అధ్యక్షుడు బుద్ధ శ్రీనివాసరావు, కార్యదర్శి, కేవీపీఎస్ ప్రకాష్, కోశాధికారి బీ సూర్యారావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



రంగుల కోసం ఎదురుచూస్తున్న సచివాలయ భవనం



పిల్లర్లతో నిలిచిపోయిన రైతు సేవా కేంద్రం

అసంపూర్తిగా భవన నిర్మాణాలు

- ఎన్నికల తర్వాత నిలిచిన సచివాలయాల పనులు
- పూర్తి చేయని కూటమి ప్రభుత్వం
- నిధులు లేమితో ముందుకు రాని కాంట్రాక్టర్లు

తుమ్మపాల: కూటమి అధికారంలోకి రావడం మొదలు మండలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడం కోసం గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి లక్షలాది రూపాయలు కేటాయించారు. ఐదేళ్ల పాటు ప్రతి గ్రామంలో అనేక భవన నిర్మాణాలు పూర్తయి ప్రజలు ఉపయోపడుతున్నాయి. అక్కడక్కడ నిలిచిపోయిన కొన్ని భవనాల పనులు పూర్తి కావాల్సి ఉన్నా కూటమి ప్రభుత్వం విస్మరిస్తోంది.

అద్దె భవనాల్లో సేవలు

జిల్లా, మండల కేంద్రాల చుట్టూ తిరిగే పనిలేకుండా గత ప్రభుత్వం ప్రజల కోసం అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంది. సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లతో పాలనను పల్లె ముంగిటకు చేర్చింది. వాటి కోసం భవనాల నిర్మాణం చేపట్టింది. ఈ వ్యవస్థలన్నీ నేడు ఆదరణ కోల్పోతున్నాయి. పరిపాలన, వైద్యం తదితరాలను ప్రజలకు చేరువ చేయాలని చేసిన సంకల్పం గాలిలో దీపంగా మారింది. కొన్ని గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌ల్లో సిబ్బంది లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పంచాయతీ గదులు, అద్దె గదుల్లో నిర్వహిస్తున్నారు. వ్యవసాయపరంగా అన్ని రకాల సేవలందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్బీకేలు రైతు సేవా కేంద్రాలుగా మారాయి. కొన్నింట నూతన భవనాలు పూర్తికాక సచివాలయాల్లో ఇరుకు గదుల్లోనే కొనసాగుతున్నాయి.



తుమ్మపాలలో అసంపూర్తిగా హెల్త్ క్లినిక్ భవనం

అసంపూర్తి భవనాలు పూర్తి చేయాలి

గత ప్రభుత్వం మంజూరు చేసిన రెండు సచి**వాలయాలు, రైతు భరో**సా కేంద్రాలు, హెల్త్ **క్లినిక్ భవనాల నిర్మా**ణాలు పూర్తికాలేదు. **కూటమి ప్రభుత్వం వాటి**ని పూర్తి చేసేందుకు దృ**ష్టి సారించడం లేదు.** దీంతో ప్రజలు తీవ్ర **ఇబ్బందులు పడుతున్నా**రు. వాటిని యధావి**ధిగా వదిలేసి ఎన్నికల కో**డ్ నేపథ్యంలో నిలిచిన **పనులను కూటమి** నాయకులు పూర్తిచేసి **గొప్పలు చెప్పుకుంటున్నా**రు. అసం**పూర్తి భవనాలకు తక్షణ**మే నిధులు **మంజూరు చేసి పూర్తి చే**యాలి.

– **తట్టా పెంటయ్యనాయుడు,** సర్పంచ్, తుమ్మపాల

పిల్లర్లు, శ్లాబ్ దశ వరకు పరిమితం

మండలంలో 26 గ్రామ సచివాలయాలున్నాయి. గత ప్రభుత్వ పాలనలో తుమ్మపాల మేజర్ పంచాయతీలో రూ.కోటి వ్యయం చేసి సచివాలయంతోపాటు రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు ఏర్పాటు చేశారు. అదే విధంగా అన్ని గ్రామాల్లో ఆర్బీకేతో పాటు హెల్త్ క్లినిక్‌లు నిర్మించారు. ఎన్నికలకు ముందు వరకు పనులు జరిగాయి. ఎన్నికల కోడ్ తర్వాత నిలిచిపోయిన భవనాలు నేటికీ ప్రారంభం కాలేదు. మేజర్ పంచాయతీ తుమ్మపాలలోనే ఆర్బీకే, హెల్త్ క్లినిక్‌లు పిల్లర్లు, శ్లాబ్ దశ వరకు పరిమితమయ్యాయి.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



లక్ష్మీదేవి పేటలో కాలువకు అడ్డంగా పెరిగిన మొక్కలను పరిశీలిస్తున్న జెడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి సూచించారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా 83వ వార్డు లక్ష్మీదేవి పేటలో ఒక ఇంటి ముంగిట కాలువలు శుభ్రం చేయడానికి వీలు లేకుండా ఏపుగా పెరిగిన మొక్కలను పరిశీలించారు. తక్షణమే వాటిని తొలగించాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం తప్పనిసరిగా ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించి, శుభ్రం చేసుకోవాలన్నారు. అనంతరం ఎన్టీఆర్ ఆస్పత్రిలో అన్నక్యాంటీన్‌ను పరిశీలించారు. అక్కడ అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్వైజర్ ఆర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పులవీధిలో జరిగిన కార్యక్రమంలో ఏఎస్‌ఎం త్రివేణి, అంగన్‌వాడీ టీచర్ కె. పార్వతి, ఎస్‌వీఎల్ లక్ష్మి పాల్గొన్ని ఇంటింటికి వెళ్లి ఖాళీగా నీరు నిల్వ కుండీలను పరిశీలించారు. ఇంటి యజమానులకు డెంగ్యూ వ్యాధిపై తగు సూచనలు చేశారు.

కార్గిల్ విజయోత్సవ ర్యాలీ నేడు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని కార్గిల్ విజయోత్సవ ర్యాలీని శనివారం నిర్వహించనున్నట్లు అనకాపల్లి సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియం నుంచి మెయిన్‌రోడ్ మీదుగా నాలుగు రోడ్ల కూడలి వరకు ఈ ర్యాలీ సాగుతుందన్నారు. కార్గిల్ యుద్ధంలో విజయం సాధించిన సందర్భంగా ఏటా జూలై 26న ఈ వేడుక నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికులు, సోషల్ వర్కర్స్, ఎన్‌సీసీ స్టూడెంట్స్‌తో పాటు ప్రజలందరూ పాల్గొనాలని కోరారు.

ప్రీ స్కూలులో ఆట పాటలతో బోధన



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

కశింకోట: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న ప్రీ స్కూలు విద్యార్థులకు ఆట పాటలతో బోధన అందించాలని కార్యకర్తలను ఐసీడీఎస్ పీడీ ఎన్ సూర్యలక్ష్మి ఆదేశించారు. కశింకోటలోని బాలికల పాఠశాల, ఇందిరా కాలనీ కేంద్రాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ప్రీ స్కూలు విద్యార్థులకు ఎలా బోధన సాగించాలనే విషయమై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమయ్యారు. వారు ముసిముసి మాటలతో చెప్పిన సమాధానాలతో సంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవలసిన ఆవశ్యకత, ఆరోగ్యం గురించి సలహాలు, సూచనలిచ్చారు. అనంతరం ఇటీవల కశింకోట సంతబయలలో పుట్టిన శిశువు మృతి చెంది మురుగు కాలువలో లభ్యమైన సంఘటనపై ఆరా తీశారు. మృత శిశువు లభ్యమైన ప్రాంతాన్ని సందర్శించారు. అందుకు కారణమైన వారి ఆచూకీ తెలిసిందా? అని ఆరా తీశారు. ఆచూకీ లేదని కార్యకర్తలు బదులిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ.జి. సంతోషి, డి. శ్యామల పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో వందే భారత్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 50 యూనిట్లు రక్తం సేకరించామని ప్రిన్సిపాల్ డి. స్వాతి మనోజ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మురళీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులే కీలకం

అనకాపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడంలో ఉపాధ్యాయులు పాత్ర ఎంతో కీలకమైనదని హెచ్‌ఎం హెచ్.బి.శ్రీధర్ తెలిపారు. మండలంలో మామిడిపాలెం హైస్కూల్ ఆవరణలో ఇక్కడ నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులను శుక్రవారం శాలువాలు, పూలమాలలతో విద్యార్థులు ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ మామిడిపాలెంలో పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదన్నారు. విద్యార్థులను తమ పిల్లలు మాదిరిగా చూసుకుని ఉత్తమ విద్య అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ ఏడాది స్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఇందుకూరి ఉమ, పువ్వుల స్వామి, లంబ గౌరీ, కామేష్, శైలజలకు చిరుకానుకలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొంది చిన్నబ్బాయి, సుబ్బారావు, రమణి, వసంత రావు, కరుణ జ్యోతి, జి.లక్ష్మి, ఆడారి లక్ష్మి, సుజాత, జగదీశ్వరి, శ్రీను, ఆచార్యులు, నారాయణ రావు, ప్రసాద్ పాల్గొన్నారు.



బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

స్మార్ట్ మీటర్లపై తప్పుదోవ పట్టిస్తున్న ప్రభుత్వం

అనకాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ప్రతి ఇంటికి బిగిస్తుందని, వీటివల్ల విద్యుత్ బిల్లులు పెరగవని ఆ శాఖ అధికారులతో తప్పుడు ప్రచారం చేయిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా ఆ శాఖాధికారులు మోసం చేస్తున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో స్మార్ట్ మీటర్లు బిగిస్తుంటే అప్పటి యువగళం పాదయాత్రలో నారా లోకేష్ సభలు నిర్వహించారన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలు కొట్టాలని చెప్పిన ఆయన తాము అధికారంలోకి వస్తే వాటిని తొలగిస్తామని అబద్ధపు హామీలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఇప్పటికే చార్జీలు పెంచి వినియోగదారులపై మోయలేని భారం వేసిందన్నారు. స్మార్ట్ మీటర్ వల్ల అనేక ప్రాంతాల్లో విద్యుత్ బిల్లులు భారీగా పెరిగినట్లు వాపోయారు. దీనిపై విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్ అంగీకరించారన్నారు. స్మార్ట్ మీటరు అంటే ప్రీపెయిడ్ మీటర్ అని ముందుగానే డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పగలు ఒకరేటు, రాత్రి ఒక రేటు విధించి బిల్లు వస్తుందన్నారు. దీని నిర్వహణ అదానీ కంపెనీ చూసుకుంటుందన్నారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్లు కొనుగోలుకు అదానీకి చెందిన షిర్డీసాయి ఎలక్ట్రికల్ కంపెనీకి రూ. 25 వేల కోట్లు విద్యుత్ శాఖ అప్పగించిందన్నారు. త్వరలో ఈ భారం ప్రజలపైనే పడుతుందన్నారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలోలో షాపులకు బిగించిన స్మార్ట్ మీటర్‌కు రూ.64 వేలు, వ్యవసాయం మోటార్‌కు రూ.23 వేలు బిల్లు రావడంలో వారు కంగుతిన్నారన్నారు. విద్యుత్ చార్జీల పేరుతో ఏడాదిలో కూటమి ప్రభుత్వం రూ.15 వేల కోట్లు భారం మోపిందన్నారు. 2024– 25లో వినియోగదారులపై రూ.850 కోట్ల భారాన్ని ఇప్పటికే మోపిందన్నారు. అబద్ధపు మాటలతో విద్యుత్ శాఖ ఉద్యోగులు ప్రజలను మోసం చేయవద్దని హితవు పలికారు.



జి.కోటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

మునగపాక పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

మునగపాక: స్థానిక పీహెచ్‌సీని శుక్రవారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి హైమావతి ఆకస్మిక తనిఖీ చేశారు. ఇక్కడ ఆస్పత్రిలోని వార్డులు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో ఎటువంటి రోగాలు సంభవించకుండా ఉండేందుకు గ్రామాల్లో వైద్య సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి, ఆరోగ్య సూపర్‌వైజర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రీడింగ్ రూమ్‌లను త్వరితగతిన పూర్తి చేయండి

- బీసీ, ఎస్సీ వసతి గృహాలను పరిశీలించిన కార్పొరేటర్ మందపాటి సునీత



గాంధీనగరం హైస్కూల్‌లో ఎండీఎం నిర్వాహకులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సునీత



బీసీ వసతి గృహంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రీడింగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత జానకీరామరాజు దంపతులు

అనకాపల్లి: పట్టణంలోని 82వ వార్డు పరిధిలో బీసీ, ఎస్సీ విద్యార్థుల వసతి గృహాలను, గాంధీనగరం హైస్కూల్‌ను కార్పొరేటర్ మందపాటి సునీత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో రీడింగ్ రూమ్‌లకు అప్పటి ఎంపీ బీవీ సత్యవతి పార్లమెంట్ నిధుల్లో రూ.20, రూ.25 లక్షలు చొప్పున మంజూరు చేశారన్నారు. వీటితో చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయని, త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోనికి తీసుకురావాలని పబ్లిక్ వర్క్స్ డీఈ కె.జానకిని కోరారు. పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని వసతి గృహాల్లో ఉంటున్నారన్నారు. వారిని ఉన్నత శిఖరాలకు చేర్చే బాధ్యత వార్డెన్లపై ఉందన్నారు. ఇంటర్ నుంచి పీజీ చదువుతున్న ఎస్సీ వసతి గృహాల విద్యార్థుల రూమ్స్ అభివృద్ధికి రూ.5 లక్షలు అదనంగా అప్పటి ఎంపీ నిధులు కేటాయించారన్నారు. దాంతో మరింత అభివృద్ధి చేశారన్నారు. ప్రభుత్వాలు మారినప్పటికీ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని అధికారులు పనులు చేపట్టాలని కోరారు.

గత పాలనలోనే అభివృద్ధి..

వైఎస్సార్‌సీపీ పాలనలో నాడు–నేడు పథకంలో రూ.90 లక్షలతో గాంధీనగరం హైస్కూల్‌ను అభివృద్ధి చేశామని, విద్యార్థులు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించామని కార్పొరేటర్ మందపాటి సునీత తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంలో అప్పటి ప్రభుత్వం అనేక మార్పులు తీసుకురావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మాట్లాడుతూ గత పాలనలో విద్య, వైద్యం రెండు నేత్రాలుగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగించారన్నారు. జోనల్ పరిధిలో ఈ హైస్కూల్ నుంచి పదో తరగతి విద్యార్థులు ఎక్కువగా ఉత్తమ ఫలితాలు సాధించడమే కాకుండా ఏటా ట్రిపుల్ ఐటీలో మంచి ర్యాంకులు సాధించారన్నారు. వార్డు పరిధిలో కొన్ని పార్కులు, డ్రైనేజీలను అప్పటి ఎంపీ నిధులతో అభివృద్ధి చేశామన్నారు. వసతి గృహాల్లో రీడింగ్ రూమ్‌కు బిల్లులు రాలేదని పనులు నిలుపుదల చేయడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం దీనిపై దృష్టి సాధించాలని కోరారు. అభివృద్ధికి పోటీ పడాలే కాని... విద్యార్థుల జీవితాలతో రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. అనంతరం హెచ్‌ఎం డి.శ్రీనివాసరావు రాములోరి చిత్రపటాన్ని కార్పొరేటర్ సునీతకు అందజేశారు. వసతి గృహాల వార్డెన్లు ఎస్.సత్యనారాయణ, రామయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండూరు రవీంద్రనాథ్, బి.ఎల్.ఎస్. శర్మ, ఆకుల సంతోష్, ఎన్.అప్పారావు, కోన ఉమ, నూకరత్నం, నాగేశ్వరరావు, దొంక సత్తిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మెయిన్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరి

శ్రావణ మాస పూజలు ప్రారంభం

అనకాపల్లి: శ్రావణమాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణ, మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో సామూహిక వరలక్ష్మీదేవి వ్రతాలను ఆలయ సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

- గవరపాలెం సతకంపట్టు కనకదుర్గ ఆలయంలో కుంకుమ పూజలు అర్చకులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పి.వి. రమణ, ఆలయ చైర్మన్ కాండ్రేగులు శ్రీరామ్, భక్తులు పాల్గొన్నారు.
- గవరపాలెం సంతోషిమాత దేవస్థానంలో అమ్మవారికి శ్రావణ మాసం పూజలు అర్చకులు నిర్వహించారు. అమ్మవారిని జోనల్ కమిషనర్ చక్రవర్తి, ఈవో మురళీకృష్ణ దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ మారిశెట్టి భాస్కర్, భక్తులు పాల్గొన్నారు.
- మెయిన్‌రోడ్డు కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని భక్తులు దర్శించుని ప్రత్యేక పూజలు చేశారు.
- గవరపాలెం గౌరీ పంచాయతన దేవాలయంలో అమ్మవారికి కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మండపంలో టీటీడీ ధర్మప్రచార పరిషత్ కళాకారిణి సామ్రాజ్‌రాణి హరికథ గానం ఆలపించారు. ఈ కార్యక్రమాన్ని వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్: సత్యనారాయణ పురం కల్యాణ గిరి కొండపైన కనకదుర్గమ్మకు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అష్టోత్తర పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు యడ్ల త్రినాథరావు, బోయిన రమణాజీ, కోటిపల్లి వెంకట రమణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం పూజలు తొలి శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారిని అలంకరించి ప్రత్యేక కుంకుమార్చనలు, పూజలు చేశారు. అర్చకుడు వెలవలపల్లి కృష్ణ ఆధ్వర్యంలో భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. సర్వమంగళాంబ సమేత త్రిపురాంతక స్వామి ఆలయం (శివాలయం)లో సర్వమంగళాంబ అమ్మవారికి మహిళల సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అర్చకుడు వి. చిదంబరం ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ కుంకుమార్చనలు జరిగాయి. మహిళలు లలితా సహస్ర నామ పారాయణ చేశారు. స్థానిక గవరపేటలోని శారదా గణపతి రామాలయంలో మహిళలు లలితా సహస్ర నామ పారాయణ, ప్రత్యేక పూజలు చేశారు.



అమ్మవారిని దర్శించుకునేందుకు లైన్లలో వస్తున్న భక్తులు



కశింకోటలో సర్వమంగళాంబ అలంకరణ



కనకదుర్గ కొండపై కనకదుర్గ అమ్మవారు



గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో హరికథగానం



గవరపాలెంలో సంతోషిమాత



కశింకోటలోని కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం పూజలు